# మధ్యాహ్నం

మహానగరం.

మధ్యాహ్నం.

కలవాడిపై లేనివాడి ఆగ్రహంలా ఎండ మండిపోతోంది.

నగరం మధ్య కొత్త ప్రదేశంలో మహా ధనికుడొకడు భవనం నిర్మిస్తున్నాడు. భవనం నిర్మించే పనివాళ్ళు దగ్గరగా ఉన్న టీ దుకాణంలో టీ తాగుతున్నారు.

నిర్మాణంలో ఉన్న భవంతినీ, దుకాణం దగ్గర టీ తాగుతున్న కూలివాళ్ళను, ముష్టి కుర్రవాడొకడు గోడనీడలో నిలబడి ఆకలితో తదేకంగా చూస్తున్నాడు. అతని కడుపులో ఆకలి అవురావురుమంటున్నది. ఆత్మారాముడి గోలకి వాడికి చాలా చిరాకేసింది. ఎంత ఊరుకోపెట్టినా ఆకలి ఊరుకోవటంలేదు. ఇక ఆకలిని కూకలేయడం అతనిశ్రమకు మించినపనయింది.

అతని అనుమతి లేకుండానే కుడిచెయ్యి లాగు జేబులోకిపోయి "ఆరుడబ్బులే ఉన్నాయిస్తా" అనే సత్యాన్ని గ్రహించి నిరాశగా బైటికివచ్చింది. ఇవాళ తనకీ ఆరుకాన్లేనా గతి?—

ఎవరిని డబ్బులడిగినా "ఏదైనా కూలిపని చేసికోరాదూ! పో! ఫో—ప్రతివాడికీ ఇదో తెగులు" అని సలహా ఇచ్చేవారే కానీ, కాని ఇచ్చేవారే కరువయారు.

తనూ కూలికి కుదిరితే—

తనూ వాళ్ళలా రూపాయి, రూపాయిన్నరా సంపాదించ వచ్చు - హాయిగా తనకి కావలసినది తిని, రెండుమూడు సార్లు టీ తాగవచ్చు.

అయినా తనని కూలికెవరు పెట్టుకొంటారు? 'కుర్రాడవు పనికిరావు పొమ్మంటారు.

అయినా కుర్రవాళ్ళకి కూలి తక్కువ. కూలి తక్కువయినా పనిమాత్రం పూర్తిగా చేయిస్తారు. ఏ అర్ధరూపాయో కన్నా ఇవ్వనే ఇవ్వరు. శ్రమపడితే తిండీ ఎక్కువ తినాలి. ఆడబ్బుల్లో తను తిని టీ తాగిస్తే ఇంటికి తీసికెళ్ళడానికేమి మిగుల్తుంది. శ్రమపడి లాభం ఏమిటి? ఈ ముష్టేనయం. ఏరోజూ అరణాలు తిండికి లేకపోయినా సవతితల్లి ఒళ్ళు కుళ్ళ పొడుస్తుంది— డబ్బులు ఇన్నే వచ్చాయన్నా ఊరుకోదు. "రోజల్లా తిరిగినా ఇంతేనా? ఖర్చు పెట్టేస్తున్నావు" అంటుంది. ఇందులో ఖర్చు పెడ్తే ఎలా ఇప్పుడు? ఆకలి ముందుకు లాగుతోంది. ఆలోచన, అనవసరంగా తొందర పడకు-అని హెచ్చరిస్తోంది.

పక్కనే ఏదో శబ్దమైతే కుర్రాడు, దృష్టి 'టీదుకాణం'నుంచి మరల్చుకొని చూశాడు. అతనికి హఠాత్తుగా నవ్వొచ్చింది. ఆ నవ్వు శబ్దంచేసికొంటూ పైకివచ్చింది. తన దగ్గరలో ఓ గుడ్డి ముష్టివాడు నడుస్తూ నడుస్తూ చేతికర్ర రెండు ముక్కలయి పడిపోయాడు. అతనికి ఊతంగాఉన్న చేతిలోకర్ర రెండు ముక్కలయింది మధ్యకి. దెబ్బ అంతగా ఏమీ తగల్లేదు కాని ముసలాడు పడిపోయాడు. ముసలి గుడ్డి ముష్టివాడికి దగ్గరలో ఎవరో తనను చూచి ఇకిలించి నవ్వుతున్నట్లు వినిపించింది. తనకున్న ఆధారం పోవడమే కాకుండా తనను చూసి నవ్వడమూ?

'కనక్ ప్రవాసి'

నవ్వుతూ ఆకలి సంగతి ఓ క్షణం మరచిపోయాడు కుర్రాడు. గుడ్డివాడి స్థితి చూస్తూంటే అతనికి నవ్వాగడంలేదు.

"ఉన్న ఆధారంకూడా పోయి ఏడుస్తూంటే ఎందుకలా నవ్వుతావు?"

కోపపడ్డాడు ముసలాడు.

కొంతసేపటికి కాని కుర్రాడికి నవ్వాగలేదు. ఆ గుడ్డి ముసలాడంటే కుర్రాడికి జాలి లేక కాదు. అతను పడిపోయి కర్రకూడ విరిగిపోయిన ఆ స్థితిచూస్తే అతనికి నవ్వొచ్చింది. ఏమిటో ఆ నవ్వు మరింత వెర్రిఅయింది. కుర్రాడికి ఆ గుడ్డివాడి పరిస్థితి అర్థమయేసరికి కన్నీళ్ళు వచ్చాయి. కన్నీళ్ళు వచ్చాక ఇక నవ్వ లేకపోయాడు కుర్రాడు.

ఆ గుడ్డి ముష్టివాడికంటె తనేంగొప్ప? అనే ఆలోచన కలిగింది కుర్రాడికి.

అన్ని అవయవాలూ సరిగా పనిచేస్తున్న తనబోటిగాళ్ళు ముష్టడిగితే-"దున్నపోతులా ఉన్నావు. కూలిచేసికోరాదా?" అని నానా తిట్లూ తిడ్తారు. కాని ఎప్పుడో కాని అందరూ చప్పున దయతో ధర్మం చెయ్యరు. కుంటి గుడ్డివాళ్ళమీద ఈ ప్రపంచం చూపించే జాలి మామూలు ముష్టివాళ్ళమీద చూపించదు. వాళ్ళకి ఒక్కోసారి ధర్మం చెయ్యకపోయినా, జాలయినా ప్రకటిస్తుంది. ఈ గుడ్డాడి సంపాదనతో పోల్చుకుంటే తనదేపాటిది? ఈ ముసలాడికి కళ్ళు కనిపించకపోవడం నిజంగా ఎంత అదృష్టం? అనుకున్నాడు. ఆ ఊహతో నీరసంలో కూడ అతని కళ్ళు మెరిశాయి.

ఈ గుడ్డివాడికి సాయంగా వాడితోకూడ తను ఉంటే ఇప్పటికంటె ఎక్కువ సంపాదించవచ్చు. ఈ ఆలోచన చప్పున స్ఫురించింది కుర్రాడికి. ఇంతకాలమూ తనకీ ఊహ రాక, ఈ సమయంలోనే అది స్ఫురించడమేమిటో కుర్రాడికి ఏదో వింత ఆనందాన్నిచ్చింది.

ఆలోచన స్ఫురించడమే తడవుగా కుర్రాడు గుడ్డివాడి దగ్గరగా వెళ్ళాడు.

"నవ్వేనని కోపంవచ్చిందా?" అన్నాడు జాలిగా.

"మరి కోపంరాదూ? నవ్వెందుకు?"

"పొరపాటున నవ్వాను. ఏమీఅనుకోకు"

"ఏమీ అనుకోను. కాని నువ్వెవరవు?"

"నేనూ ముష్టెత్తుకొనే వాడినేలే! ఐతే నీ చేతికర్ర పోయిందికదా, మరి ఎలా నడుస్తావు?"

"కర్ర వుంటే, కళ్ళు లేకపోయినా యిబ్బంది లేకపోయేది. ఎలాగా అని


కలాపి
టాల్కం పౌడరు

రెండు కొత్త ప్యాకింగులలో దొరుకును.
టిన్ను రు. 2-25
కార్డుబోర్డుపెట్టె రు. 1-50
కలాపి ఇండస్ట్రీస్, బొంబే - 2.

## ★ యథాపూర్వం ★

ఆలోచిస్తున్నా. అంతా ఆ రామయ్య తండ్రిదయ" అని నిట్టూర్చాడు గుడ్డివాడు.

"ఫరవాలేదు తాతా; నేనూ ముష్టెత్తడమే గనక నీకు సాయంగాకూడా వుంటాను. రోజూ వచ్చింది మనం ఇద్దరం సమంగా పంచుకుందాం. నీ కిష్టమేనా?"

"నానాయనే! నాబాబే! ఎంతకాలానికి దొరికావు నాయనా! ఎంతకాలంనుంచో చూస్తున్నాను. నీలాటి కుర్రాడెక్కడైనా దొరుకుతాడా అని. ఇన్నాళ్ళకి ఆ రామయ్యతండ్రే కనికరించి నిన్ను పంపించాడు", అన్నాడు ఆనందంతో గుడ్డివాడు.

* * *

గుడ్డివాడూ కుర్రవాడూ నడుస్తున్నారు.

గుడ్డివాణ్ణి కుర్రవాడు నడిపిస్తున్నాడు.

కర్రపోయిన క్షణంలోనే తనకీ కుర్రాడి ఆధారం చూపించిన దైవానికి మనస్సులో నమస్కరించాడు గుడ్డివాడు. తనకీ గుడ్డివాడివల్ల సంపాదన పెరుగుతుందనే ఆనందంతో అడుగు చురుగ్గా వేస్తున్నాడు కుర్రాడు.

కుర్రవాడు—

గుడ్డివాడు—

కుర్రాడు ముందూ—గుడ్డాడు వెనకా.

గుడ్డివాడు కుర్రాడి అడుగులో అడుగు కలపలేక పోతున్నాడు.

ఏమైనా వాడు కుర్రాడు, కళ్ళున్నవాడూ.

తనేమో ముసలాడు, గుడ్డాడూ.

ఇద్దరి నడకా ఒకటెలా అవుతుంది?

కుర్రాడు గబగబా అడుగులు వేస్తున్నాడు.

గుడ్డివాడికి, బరబర లాక్కుపోతున్నట్టుంది, కాని తనకిసాయంగా ఉండి నడిపిస్తున్నట్టు లేదు. ఇంతకాలం తానొక్కడూ నడవడం కుర్రాడికి అలవాటు. తన యిష్టం వచ్చినట్టు నడిచేవాడు.

గుడ్డివాడికి కర్ర ఆధారమేకాని మనిషి సాయం ఎప్పుడూలేదు. కుర్రాడు దారి చూపుతూంటే అతనికీవేళ నడక కొత్తగా ఉంది. అడుగు త్వరగా పడటంలేదు.

చేతికర్ర ముసలాడి స్వాధీనంలోవుంటేది


నాలుగు మందులుగల 'అనాసిన్' కంటె ఎక్కువ శీఘ్రముగా పనిచేయునది ఇంకేదీ లేదు

1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్
3. కఫిన్ 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్

'అనాసిన్'—గొప్ప బాధానివారణి—వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి నరముల ముఖ్యస్థానము లందు సంయుక్తచర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి రూఢిగా, సురక్షితమైన శీఘ్రవిముక్తి ని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతి సురక్షితమైనట్టిది మరేదీ లేదు. జ్ఞాపకముంచు కొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉబ్బరముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారణి ఎందుకనగా ప్రతివారున్ను 'అనాసిన్' ను కొనగలరు.
ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే.

నాలుగు మందుల సూత్రమైన 'అనాసిన్' వాడుడు




జాఫ్రి మేన్నర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్. రిజిస్టర్డు ఉపయోగకులు.

ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే

# మరీ బడాయి!

గొప్ప డాక్టర్‌గా పేరుపడిన ఒకాయన చాలకాలం తరవాత తను పుట్టి పెరిగిన గ్రామం వచ్చాడు. గ్రామస్థులు ఆయన్ని ఇంద్రుడనీ, చంద్రుడనీ బ్రహ్మరథం పట్టేశారు. పాపం ఆ డాక్టరు స్వతహాగా మంచివాడు, వినయం గలవాడు. ఇందులో తన గొప్పదనం ఏమీ లేదని చెప్పాలని ఆయన ఉద్దేశం. అందుకని సన్మానానికి సమాధానంగా,

"ఈ పొగడ్తలకు నేను అర్హుణ్ణికాను. ఇందులో నేను చేసిందేమీ లేదు. రోగులు తమంతటతామే నా దగ్గిరికి వస్తారు. మామూలుగా తమ రోగమేమిటో తామే చెప్పేస్తారు. మామూలుగా తమ రోగానికి మందేమిటో తామే చెప్పేసి కొనుక్కుంటారు..." ఈ తరహాలో చెప్పుకుపోయాడు ఆయన.

—మిసెస్ జి. క్రాస్.

చేతికర్ర ఉన్నప్పటి ధీమా, ఆ తృప్తి వేరు. కర్ర పోయినందుకు, ఒకవిధంగా కుర్రాడి సాయం దొరికినందుకు వాడికి ఆనందంగానే ఉంది. వాడు లేకపోతే తనస్థితి నిస్సహాయం- అదే అతనికి బాధాకరంగా వుంది.

స్వేచ్ఛగా నడిచే కుర్రాడికిమాత్రం యీ ముసలాడు భారం కాదూ? ఓ గుడ్డివాడికి సాయపడుతున్నాననే ఆనందం కుర్రాడికి లేకపోయింది. ఈ గుడ్డిముసిలాడు తన స్వేచ్ఛకి ఎంత అవరోధంగా ఉన్నాడో మూడోనాటికి కుర్రాడికి అనుభవానికొచ్చింది. ఈ మూడురోజులూ ఇద్దరూ ఎవరిబాధను వారు అనుభవిస్తూ ఏదోవిధంగా సరిపెట్టుకుంటూ వస్తున్నారు.

నాలుగోరోజు ఇద్దరికీ చెడింది.

ఈ కుర్రకుంక పనికిమాలిన వెధవ అని గుడ్డివాడు గ్రహించాడు. తనతో తిరగనప్పుడు వీడికి రోజుకి అణా అయినా ఉండేదికాదు సంపాదన-అనుకున్నాడు.

ఈ గుడ్డివాడు వట్టి సోమరిపోతు వెధవ. ఎక్కడో ఓ చోట కూర్చోడమేగాని ఊరంతా తిరగలేడు వీడు. కూర్చుని తింటున్నాడు. తనే లేకపోతే వీడికీమాత్రం సంపాదన కూడా ఉండేదికాదు కదా- అనుకున్నాడు కుర్రాడు.

ఎవరైనా డబ్బులు వేస్తుంటే డబ్బా పట్టేవాడు కుర్రాడు. అప్పుడప్పుడు అందులో పడే డబ్బులు తీసి జేబులో దాచుకున్నాడు కుర్రాడు. గుడ్డివాడికి తెలియకుండా రహస్యంగా డబ్బాలో ఎన్ని డబ్బులు పడిందీ లెక్కచూశాడు కుర్రాడు. రూపాయి మూడణాలు ఉంది - అందులో మూడణాలు వాడివి.

"రూపాయి పైగా ఉంటుందేమో" అన్నాడు గుడ్డివాడు, కుర్రాడు డబ్బులు లెక్కపెడుతూంటే. కుర్రాడికి చాలా కోపం వచ్చింది.

ముప్పావలాకన్న ఎక్కువ లేదని చెప్పదల్చుకున్నాడు కుర్రాడు. 'గుడ్డివాడు ఎంత పడిందీ ఊహించాడా? లేక పడేడబ్బులు చప్పుడునుబట్టికాని గ్రహించాడేమో!' అనుకొన్నాడు కుర్రాడు.

తనకీ వేళ గుడ్డివాడికంటె ఎక్కువ వాటా రావలసిందే! పద్నాలుగణాలని లెక్కచెప్పాడు, బాగా ఆలోచించి.

"అంతేనా? ఇంకా ఎక్కువే ఉంటాయే-సరిగ్గా లెక్కపెట్టు మళ్లీ" అన్నాడు గుడ్డాడు.

"ఇదుగో చూడు" అని రూపాయిలోంచి బేడతీసి నెమ్మదిగా జేబులో వేసుకొని "ఇదుగో పద్నాలుగణాలు- నేనేమైనా తినేశానా? అందులో ఏడణాలు నీవి. ఏడణాలు నావి. ఈ వేళ అట్టే రాలేదు కనక, పాపం, పోనీ నాదాంట్లోది ఓ అర్ధణా తీసికో" అని జాలి చూపించాడు కుర్రాడు.

తనమీద జాలికొద్దీ ఇంకో అర్ధణా వాడు తన దాన్లోంచి తీసి దానం చేస్తుంటే గుడ్డివాడు ఏం మాట్లాడగలడు! ఏం చేస్తాడు?

దగ్గర చెత్తకుండీక్రింద పులివిస్తరాకులు పడినాయి. పడీపడడంతోనే ఓ కుక్క వచ్చింది. అది ఓ ఆకులాగిందోలేదో మరో కుక్క "రంయి" మని వచ్చింది. రెండో కుక్క మొదటిదాన్ని గెంటేసింది. ఆ వచ్చిన రెండోది బలమైనది, నోరున్నది. మొదటికుక్క ఓ ఆకు చిక్కించుకొని దూరంగా లాక్కుపోతుంటే రెండోది దాంతో కొట్లాడి ఆ ఆకులో కూడ సగం చింపేసి మిగిలిన ఆకులకేసి రాకుండా చూసుకుంటూ తింటూంది.

గుడ్డివాడికి కుక్కల కొట్లాటతో ఆకలి కేకలేసింది. "ఆకలేస్తోంది కొని పట్టుకురా ఏదైనా" అన్నాడు గుడ్డివాడు. ఏదైనా కొనిపట్టుకు రావడంలో గుడ్డాడికి ఇందాక తను ధర్మంచేసిన అర్ధణా కొట్టేయాలనుకున్నాడు కుర్రాడు.

గుడ్డి వెధవ—ఏం తెలుస్తుంది?

ఏదైనా కొని తేడానికి బయలు దేరాడు కుర్రాడు. ఒక్కొక్క అడుగే వేస్తుంటే ఒక్కొక్క కొత్త ఆలోచన స్ఫురించ సాగింది కుర్రాడికి. ఏమీ కొనకుండా, ఈ డబ్బులేవీ ఇవ్వకుండా తను ఇలా పారిపోతే-తనకీ కడుపు నిండుతుంది.- ఈ శని పీనుగ వెడదా వదులుతుంది.

గబగబా నడుస్తున్నాడు కుర్రాడు. గుడ్డివాడిని వెనక కలిసికొన్న చోటికి వచ్చాడు. మేడకట్టే చోట కూలీలందరూ వెళ్ళిపోయారు. అప్పుడే చీకటికూడ పడింది:

గుడ్డివాడు మళ్ళీ జ్ఞాపకానికి వచ్చాడు. తను లేకపోతే గుడ్డివాడి అవస్థేంఅవుతుందో? గుడ్డివాడికి తను అన్యాయం చేస్తున్నానేమో అనిపించింది కుర్రాడికి—ఆ భవనం దగ్గర ఎవరూ లేరు. అక్కడున్న కర్రలో కాస్త పొడుగుపాటిది చేతికి సరిపోయే వెదురు కర్ర ఒకటి ఏరి తీసికొని వెనక్కి తిరిగి వచ్చాడు.

వచ్చేసరికి గుడ్డివాడు కూర్చునే నిద్రపోతున్నాడు. వాడికి దగ్గరగా ఆకర్ర ముక్క పెట్టి వచ్చేశాడు.

చెత్తకుండీ దగ్గర రెండో కుక్క ఇంకా ఏదో తింటోంది. మొదటి కుక్క ఎక్కడికి పోయిందో పోయింది. కుర్రాడు పోతూ పోతూ ఊరుకోక ఆ కుక్కను ఒక్క తాపు తన్నాడు. అది 'కుయ్యో' మంటూ కొంచెందూరం పరుగెత్తింది. కుర్రాడు వీధి మలుపు తిరగగానే మళ్ళీ కుక్క కుండీ దగ్గరకొచ్చి తింటోంది.

(ఆంగ్లకథ ఆధారం )

★

పండిత డి.గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయ రోగనివారిణి

ఆయుర్వేదాశ్రమం,

(ప్రైవేటు) లిమిటెడ్., మద్రాసు-17